క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం

ఖమ్మం లీగల్: విద్యార్థులు బాల్యదశ నుంచే వారి రక్షణకు సంబంధించిన వివిధ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎం.హనుమంతరావు అన్నారు. శనివారం స్థానిక రోటరీనగర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. రక్షణ, న్యాయవ్యవస్థల గురించి వివరించారు. హెచ్ఎం ఎ. పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

అవయవదానం


రంగారావు(ఫైల్)

నేలకొండపల్లి: తాను మరణించినప్పటికీ నలుగురికి పునర్జన్మనిచ్చిన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మంగ్రాజుపల్లికి చెందిన మందపల్లి రంగారావు (52) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు అతని కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించటంతో అవయవదానాలు చేశారు. రంగారావు మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. ఎంపీపీ వజ్జా రమ్య, రమేష్, సీతారాములు, భద్రయ్య, శ్రీనివాసరావు, వెంకన్న నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ప్రభుత్వ కార్యదర్శిని కలిసిన 'సాధు'


పుష్పగుచ్ఛం అందజేస్తున్న రమేష్‌రెడ్డి

ఖమ్మంవన్ టౌన్: గనులు, భూగర్భ, పరిశ్రమల శాఖ ప్రభుత్వ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్‌ను గ్రానైట్ అసోసియేషన్ బాధ్యుడు, కాంగ్రెస్ నాయకుడు సాధు రమేష్‌రెడ్డి శనివారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఖమ్మంలో ఉన్న గ్రానైట్ పరిశ్రమలో ఉన్న సమస్యలను తెలిపి, పరిష్కరించాలని కోరారు.

10న అప్రెంటీస్ మేళా

ఖమ్మం సహకారనగర్: ఈ నెల 10న నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పీఎం జాతీయ అప్రెంటీస్ మేళాను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి ఎంఎన్‌సీ కంపెనీలు, జిల్లాలోని లోకల్ కంపెనీలు మేళాలో పాల్గొంటున్నాయన్నారు.

ప్రవేశాలకు ఆహ్వానం...
జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2024-25వ విద్యా సంవత్సరంలో మొదటి విడతలో మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు రెండో విడత అడ్మిషన్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, ఐటీఐ కన్వీనర్ ఏ.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఖమ్మం పోస్టుమాస్టర్‌గా సుబ్రహ్మణ్యం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్‌గా(హెచ్ఎస్‌జీ-1)కే సుబ్రహ్మణ్యం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన వివిధ క్యాడర్ల పోస్టుమాస్టర్ల బదిలీల్లో హన్మకొండ హెడ్‌పోస్టాఫీస్‌లో పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం ఖమ్మంకు బదిలీ అయ్యారు.

8న పండితాపురంలో గ్రామ సభ

కామేపల్లి: కొమ్మినేపల్లి(పండితాపురం) గ్రామ పంచాయతీ పరిధి శ్రీ కృష్ణప్రసాద్ పశువుల వారంతపు సంత కౌలు నిర్వహణ బాధ్యతలు అప్పగించుటకు సంబంధించి సోమవారం ఉదయం 11 గంటలకు సంత ఆవరణలో గ్రామసభను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రవీందర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంత బహిరంగ వేలాన్ని మూడుసార్లు నిర్వహించగా ప్రభుత్వ మద్దతు ధర రాకపోవడంతో వాయిదా వేశామని, వేలంలో భూక్యా వీరన్న రూ.1,46,10,000లకు హెచ్చు పాటదారుడిగా నిలిచాడని దీంతో సదరు పాటదారుడికి సంత కౌలు బాధ్యతలను అప్పగించుటకుగానూ గ్రామ సభను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

ఉచిత బడిబస్ సర్వీస్‌లు కొనసాగించాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు చుట్టుపక్కల నుంచి వస్తున్న విద్యార్థులకు గతంలో నడిపిన విధంగా ఉచిత బడి బస్‌సర్వీస్‌లను నడపాలని, ఒక్కో విద్యార్థి నెలకు రూ.980 కడితేనే నడిపిస్తాం అనడం సరికాదని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదరిశ టి.ప్రవీణ్‌లు కోరారు. బస్ సర్వీస్‌లను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ ఖమ్మం ఆర్ఎం సరిరామ్‌కు డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. కూరపాటి శ్రీనివాస్, రావులపాటి నాగరాజు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకే సిటీబస్..!


కొత్తబస్టాండ్‌లో 18వ నంబర్ ప్లాట్‌ఫాంపై నిలిపిన సిటీ బస్ సర్వీసు

ప్రయాణికులకు ప్రయోజనం లేని సర్వీసులు
- కొత్త బస్టాండ్‌లో కనిపించకుండా బస్ నిలుపుదల
- ప్లాట్‌ఫాంల వద్దకు వచ్చి ప్రయాణికులను తీసుకెళ్తున్న ఆటో డ్రైవర్లు
- పట్టించుకోని అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో కొత్త బస్టాండ్ నిర్మించిన తర్వాత పాత బస్టాండ్ నుండి ప్రయాణికుల సౌకర్యార్థం సంస్థ సిటీ బస్ సర్వీసులను తిప్పుతూ వస్తుంది. కొన్నాళ్లు నిలిచిపోయిన ఈ సర్వీసులను అధికారులు నెల రోజుల క్రితం ప్రారంభించారు. అయితే పేరుకే ఈ సర్వీసులను నడుపుతున్నారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సిటీ సర్వీసులను తిప్పడం లేదనే ఆరోపణలు ప్రయాణికుల నుండి వ్యక్తమవుతున్నాయి. పాత బస్టాండ్ నుండి కొత్త బస్టాండ్‌కు వెళ్లే సమయంలో ప్రయాణికులు ఈ బస్సును ఎక్కుతున్నప్పటికీ.. కొత్త బస్టాండ్‌లో మాత్రం ప్రయాణికులను ఎక్కించుకోవడం లేదు. కొత్త బస్టాండ్‌కు చేరుకున్న ప్రయాణికులకు కనీసం సిటీ బస్సు సర్వీసు ఉందన్న సంగతి కూడా తెలియకుండా చేస్తున్నారు.

18వ ప్లాట్‌ఫాంపై సిటీ సర్వీసు..
వివిధ ప్రాంతాల నుండి ఖమ్మానికి పల్లెవెలుగు బస్సుల్లో వచ్చే ప్రయాణికులు పాత బస్టాండ్‌కు, ఎక్స్‌ప్రెస్, సూపర్‌లగ్జరీ, ఏసీ బస్సుల్లో వచ్చే ప్రయాణికులు కొత్త బస్టాండ్‌కు చేరుకుంటారు. వీరు నగరంలో వివిధ ప్రాంతాలకు చేరుకునేందుకు వీలుగా సిటీ సర్వీసులను ఏర్పాటు చేశారు. పాత బస్టాండ్‌లో సిటీ సర్వీసు కోసం 1వ నంబర్ ప్లాట్‌ఫాంను కేటాయించిన అధికారులు కొత్త బస్టాండ్‌లో మాత్రం ప్రయాణికులకు కనిపించకుండా.. 18వ నంబర్ ప్లాట్‌ఫాంను కేటాయించారు. కొత్త బస్టాండ్‌లో 1 నుండి 5వ నంబర్ ప్లాట్‌ఫామ్‌ల వరకు బయట ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణికులు బస్సు దిగేందుకు కేటాయించారు. ఈ ప్లాట్‌ఫాంలపై దిగుతున్న ప్రయాణికులకు సిటీ సర్వీసు కనిపించకపోవడంతో బయటకు వెళ్లి ఆటోలను ఆశ్రయిస్తున్నారు. సిటీ సర్వీసులో తక్కువ చార్జీతో ప్రయాణించే వీలున్నా అధికారుల తీరుతో ప్రయాణికులు ఆటోలను ఎక్కి తమ గమ్యస్థానాలకు చేరాల్సిన పరిస్థితి ఉంది. ఇక పాతబస్టాండ్‌కు వెళ్లే ప్రయాణికులు సైతం ఆటోలను ఆశ్రయించేలా అధికారుల చర్యలు ఉన్నాయన్న విమర్శలు ఉన్నాయి. పాత బస్టాండ్ నుండి సిటీ సర్వీసు కొత్త బస్టాండ్‌కు వచ్చే సమయంలో 40 మందికి పైగా ప్రయాణికులు వస్తున్నా.. కొత్త బస్టాండ్ నుండి స్టార్ట్ అయ్యే సమయంలో కనీసం 10 మంది కూడా బస్సులో ఉండడం లేదు. ఇప్పటికైనా అధికారులు సిటీ సర్వీసులను 6, 7 నంబర్ ప్లాట్‌ఫామ్‌లపై నిలిపితే ఎక్కేందుకు వీలుంటుందని, సిటీ సర్వీసు తమకు కనిపిస్తుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

ప్లాట్‌ఫాంల వద్దకు ఆటో డ్రైవర్లు..


బస్సు దిగిన ప్రయాణికులను ఆటో స్టాండ్ వైపు పంపిస్తున్న ఆటో డ్రైవర్లు

ప్రయాణికులు దిగేందుకు ఏర్పాటు చేసిన 1 నుండి 5 ప్లాట్‌ఫాంలపై బస్సులను నిలపగానే ఆటో డ్రైవర్లు ప్లాట్‌ఫాంల వద్దకు వస్తున్నారు. వారిని ఎలాంటి అనుమతి లేకున్నా.. ప్రయాణికులను చుట్టుముట్టి ఎక్కడకు వెళ్లాలి, బయటకు రండి ఆటోలు ఉన్నాయంటూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. సిటీ సర్వీసులను చూసుకునేందుకు కూడా ఆటో డ్రైవర్లు వీలు కల్పించడం లేదు. ప్రయాణికులకు ఇబ్బంది కలిగించేలా ఆటో డ్రైవర్లు ప్రవర్తిస్తున్న స్టేషన్ మేనేజర్ కనీసం పట్టించుకోడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. బస్టాండ్‌లో అడ్డా పేరుతో విచ్చలవిడిగా ఆటోలను నిలుపుతున్నా.. ఆటో డ్రైవర్లు గొడవలు పడుతున్నా స్టేషన్ మేనేజర్ కిమ్ అనకుండా ఉంటున్నారనే విమర్శలు ఉన్నాయి. సిటీ సర్వీసు ఉన్న 18వ నంబర్ ప్లాట్‌ఫాం వైపు ప్రయాణికులను వెళ్లకుండా డ్రైవర్లు చేతులు అడ్డుపెట్టి ప్రయాణికులను బయటకు పంపిస్తున్నా బస్టాండ్ మేనేజర్, సిబ్బంది, సెక్యూరిటీ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇక ఆటో వద్దకు వెళ్లిన ప్రయాణికుల నుండి డ్రైవర్లు వందల రూపాయలు డిమాండ్ చేస్తున్నారు. కొత్త ప్రయాణికులు అయితే అడిగినంత చేతిలో పెట్టి ఆటో ఎక్కి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది

ఆటోడ్రైవర్లకు అనుమతి లేదు..
"కొత్త బస్టాండ్‌లోని ప్లాట్‌ఫామ్‌ల వద్దకు వచ్చి ప్రయాణికులను బయటకు తీసుకెళ్లేందుకు ఆటో డ్రైవర్లకు అనుమతి లేదు. కంట్రోలర్‌లు లేని సమయంలో ఆటో డ్రైవర్లు బస్టాండ్‌లోకి వస్తున్నట్లు ఉంది. సిటీ సర్వీసును 18వ నంబర్ ప్లాట్‌ఫాంపై నిలపాలని మాకు ఆదేశాలు ఉన్నాయి.
– రఘుబాబు, స్టేషన్ మేనేజర్, ఖమ్మం కొత్త బస్టాండ్

మెజార్టీ తగ్గినా బీజేపీలో మార్పు రాలేదు

- ఎంపీ రఘురాంరెడ్డి



ఎంపీని సన్మానిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: 20 పార్లమెంటు స్థానాలు విపక్షాలకు పెరిగితే దేశ రాజకీయ ముఖ చిత్రంలో స్పష్టమైన మార్పు వచ్చేదని, బీజేపీ పాలన నుంచి దేశానికి విముక్తి లభించేదని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. పార్లమెంటులో మెజార్టీ తగ్గినా బీజేపీలో మార్పు లేదని, ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. పార్లమెంటు సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఖమ్మంకు వచ్చిన ఎంపీ రఘురాంరెడ్డి శనివారం ఖమ్మంలోని సీపీఐ కార్యాలయానికి వెళ్లగా పార్టీ సీపీఐ శ్రేణులు ఎంపీకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన అభినందన సభలో రఘురాంరెడ్డి మాట్లాడుతూ... 40 ఏళ్ల నాటి ఎమర్జెన్సీని ఎత్తి చూపడం ద్వారా బీజేపీ ఏమి సాధించాలనుకుంటుందో అర్థం కావడం లేదన్నారు. బడ్జెట్ సమావేశాల్లో సింగరేణి సమస్యను లేవనెత్తుతానన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ... రఘురాంరెడ్డి విజయంలో కమ్యూనిస్టు శ్రేణులు తమ వంతు పాత్రను నిర్వర్తించారన్నారు. నాయకులు మహ్మద్ మౌలానా, దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, సిద్దినేని కర్ణకుమార్, కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఖమ్మం మామిళ్లగూడెం: ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. నాయకులు రాములు, చిన్నప్ప, నాగేశ్వరరావు, ఎర్రగంగాధర్ ఉన్నారు.

నేలకొండపల్లి: ఎంపీ రఘురాంరెడ్డిని ఖమ్మం జిల్లా ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బోయిన వేణు సన్మానించారు. ఎస్సీ సెల్ పాలేరు డివిజన్ మాజీ అధ్యక్షుడు సూరేపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..
ఖమ్మంవన్‌టౌన్: దాడి ఘటనలో తీవ్రంగా గాయపడి నగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్రాలపాడుకు చెందిన దాసరి వెంకటేశ్వర్లు, ఆయన కుమారుడు దాసరి సైదులును ఎంపీ పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

ఖమ్మంఅర్బన్: ఎంపీ రఘురాం రెడ్డిని కార్పొరేటర్లు సన్మానించారు. డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పొరేటర్లు తేజావత్ హుస్సేన్, మలీదు వెంకటేశ్వర్లు, భారతిచంద్ర, లకావత్ సైదులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో గుర్తిస్తే కేన్సర్ దూరం


మాట్లాడుతున్న బత్తినేని ప్రకాశ్

ఖమ్మంమయూరిసెంటర్: సకాలంలో గుర్తిస్తే కేన్సర్‌తో ఎలాంటి ప్రమాదం ఉండదని ప్రకాశ్ ప్రాజెక్ట్స్ అధినేత బత్తినేని ప్రకాశ్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ప్రాజెక్ట్స్ డైరెక్టర్ బత్తినేని స్వాతి న్నారు. సీపీఎం టూ టౌన్ కమిటీ, బోడేపూడి విజ్ఞాన కేంద్రం, ప్రకాశ్ ప్రాజెక్ట్, తానా ఆధ్వర్యంలో గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ హైదరాబాద్ వారిచే శనివారం ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో నిర్వహించిన ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరానికి విశేష స్పందన లభించింది. 300కు పైగా మందికి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ... నెలనెలా ఉచిత మెడికల్ క్యాంప్‌లో భాగంగా ఈ సారి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కమ్యూనిస్టులు వలంటరీ సేవల్లో ముందుంటారని ప్రకాశ్ ప్రాజెక్ట్స్ అధినేత బత్తినేని ప్రకాశ్, డైరెక్టర్ స్వాతి అన్నారు. ప్రాజెక్ట్స్ డైరెక్టర్ భీమవరపు పుల్లారావు, ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు బత్తినేని నీరజ, డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్, కిమ్స్ హాస్పిటల్ వైద్యులు రజిత, ఆరోగ్య హాస్పిటల్ డాక్టర్ సుధాకర్, బీవీకే జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు, గ్రేస్ క్యాన్సర్ హాస్పిటల్ డాక్టర్ సంజయ్, కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల, సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, మాచర్ల భారతి, ఝాన్సీ, మాదినేని రమేష్, జనత ఆస్పత్రి డాక్టర్ సి.భారవి, వైద్యులు రంజిత్, సుబ్బారావు ఉన్నారు.

పంటల నమోదు పరిశీలన


పంటల నమోదును పరిశీలిస్తున్న ఏఓ వాణి

కూసుమంచి: మండలంలోని పోచారం క్లస్టర్ పరిధిలో ఏఈఓలు చేపట్టిన పంటల నమోదు కార్యక్రమాన్ని శనివారం ఏఓ వాణి పరిశీలించారు. నమోదుపై వారికి తగు సూచనలు అందించారు. సర్వే నంబర్ల ఆధారంగా రైతులు సాగుచేసిన పంటలను యథావిధిగా యాప్‌లో నమోదు చేయాలని, త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే లాభాలను వివరించారు. ఏఈఓ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఉపేందర్

ఖమ్మం మామిళ్లగూడెం: యూనిటీ ఆఫ్‌మాల ఖమ్మం జిల్లా సమితి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 9న ఖమ్మం బైపాస్‌రోడ్డులోని కృష్ణా ఫంక్షన్ హాలులో నిర్వహించే తృతీయ మహాసభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కందుల ఉపేందర్, అవుట మధు, వర్కింగ్ ప్రెసిడెంట్ జాగటిమధు కోరారు. శనివారం ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. సంఘ స్టీరింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్ బీజే క్లైమెంట్, ఎల్లయ్య, చిరుబత్తిని కనకయ్య, రవి, రాజు, దుంపల సుధాకర్ పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై దాడి

నేలకొండపల్లి: ఓ వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తించటంతో ఆమె కుటుంబ సభ్యులు మూకుమ్మడిగా దాడి చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఓ వివాహిత శనివారం రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో నేలకొండపల్లికి చెందిన ఓ మెకానిక్ ఇంట్లోకి వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలు భర్తకు తెలపటంతో భర్త, ఆమె సోదరులు వచ్చి సదరు వ్యక్తిపై దాడి చేశారు. దీంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఇరువర్గాల వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గాయపడిన వ్యక్తిని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

కలెక్టర్‌కు వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్ ఉన్నత పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని, ఖమ్మం నుంచి జాన్‌బాద్‌తండా వరకు విద్యార్థులకు ఆర్టీసీ బస్ సౌకర్యం, తదితర సమస్యలపై డీవైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శనివారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతాపనేని వెంకటేశ్వర్లు, వెంకన్న, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నియంత్రణలో భాగస్వాములు కావాలి

నేలకొండపల్లి: మాదక ద్రవ్యాల నియంత్రణలో విద్యార్థులు భాగస్వామ్యులు కావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ శాస్త్రి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శనివారం సైబర్ నేరాలపై విద్యార్థులకు పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఆర్.ఆమోస్, ఎస్సై తోట నాగరాజు, పోలీస్ సిబ్బంది రాజేష్, చరణ్‌సింగ్, సీతారాములు, అధ్యాపకులు సత్యనారాయణరెడ్డి, భరత్‌కుమార్ ఉన్నారు.

వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి


టీకాలు వేస్తున్న వైద్యులు

నేలకొండపల్లి: పెంపుడు కుక్కలకు వ్యాధులు సంక్రమించకుండా పలు జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ బీ.వెంకటేశ్వర్లు సూచించారు. మండల కేంద్రంలో శనివారం జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్.టి.సంజయ్‌రెడ్డి, వెన్నపూసల సీతారాములు, సత్యనారాయణ, యడవల్లి ఉపేందర్, గోపాల మిత్రలు జీ.నరసింహారావు, నరేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రఘునాథపాలెం: మండలంలోని గణేశ్వరం 11 కేవీ విద్యుత్‌ఫీడర్‌లైన్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ సెక్షన్ ఏఈ ఇందిరా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలనుండి 11 వరకు ఫీడర్ పరిధిలోని అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

శివాయిగూడెం ఫీడర్ పరిధిలో...
మండలంలోని శివాయిగూడెం ఫీడర్ పరిధిలో లైన్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 నుంచి 11 వరకు అంతరాయం ఉంటుందని మంచుకొండ సెక్షన్ ఏఈ పి.సతీష్ తెలిపారు.

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 33/11 కేవీ గాంధీచౌక్ స్టేషన్ 11 కేవీ గుట్టలబజార్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు గాంధీచౌక్, రైల్వే స్టేషన్ రోడ్, సుందర్ థియేటర్‌లైన్, ఆంధ్రాబ్యాంక్ రోడ్, మోహన్ రోడ్, జహీర్‌పుర తండా, కిన్నెరసాని థియేటర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఉంటుందని టౌన్-1 సెక్షన్ ఏఈ మౌలికతెలిపారు.

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని పారిశ్రామిక ఫీడర్ల పరిధిలో లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. వీవీపాలెం ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, పారిశ్రామిక ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి 2వరకు వీవీపాలెం, కలెక్టరేట్ సముదాయం, జీఆర్ఆర్ శ్రీనివాసమ్, పుట్టకోట రోడ్డు ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

నాయకులను విడుదల చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కెచ్చల రంగయ్య, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఇతర కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల వెంకటేశ్వర్లు, సీవై పుల్లయ్య, గుర్రం అచ్చయ్య, జి.రామయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గాజాలో పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడికి వ్యతిరేకంగా శనివారం హైదరాబాదులో రాజ్‌భవన్ వద్ద శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న పార్టీ నేతలను, కార్యకర్తలను అరెస్ట్ చేయడం తగదన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలి

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని నేలకొండపల్లి ఇన్‌చార్జ్ ఎంఈఓ బాలిన చలపతిరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ యం.యర్రయ్య, ఐకేపీ ఏపీయం అశోక్‌రాణి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు టి.వెంగళరావు, టి.గురవయ్య, నరేందర్, పాల్గొన్నారు.

పీజీ కాలేజీలో క్లీన్ అండ్ గ్రీన్


కార్యక్రమం నిర్వహిస్తున్న సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: నగరంలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలలో శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చేకూరి రవికుమార్ తెలిపారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి కమిటీలు

నేలకొండపల్లి: ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా పారిశుద్ధ్యానికి గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో చాంబర్‌లో శనివారం స్పెషల్ ఆఫీసర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కన్వీనర్‌గా పంచాయతీ కార్యదర్శి, సభ్యులుగా ఏఎన్‌యం, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్, గ్రామ దీపికలు, ప్రధానోపాధ్యాయులతో కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ, ఐకేపీ ఏపీయం అశోక్‌రాణి, మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లిస్తాం

కామేపల్లి: మండలంలోని నెమలిపురి గ్రామంలో ఆరేళ్లుగా నిలిచిపోయిన మరుగుదొడ్ల బిల్లులను త్వరలోనే గ్రామ సభ ఏర్పాటు చేసి అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామని జీపీ కార్యదర్శి కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీడబ్ల్యూఎస్‌సీ ఖాతాలో నిధులు ఉన్నాయని, జీపీ పరిధిలో 100 మంది మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టగా కేవలం 17 మంది లబ్ధిదారులకు మాత్రమే బిల్లులు మంజూరు కావడంతో బిల్లుల చెల్లింపు విషయంలో స్పష్టత లేకపోవడంతో బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగిందని తెలిపారు.

నివాళి

నేలకొండపల్లి: భారతీయ జన సంఘ్ స్థాపకులు, స్వాతంత్ర సమరయోధుడు శ్యామ్ ప్రసాద్ వర్ధంతి సందర్భంగా శనివారం మండలకేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మోహినుద్దీన్, పిట్టల సూరిబాబు, బాజా రామకృష్ణ, గోపి, కోటేశ్వరరావు, మూడు రమేష్, పోనుగోటి నాగయ్య, వేణు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ కమిటీ ప్రమాణ స్వీకారం

ఖమ్మంగాంధీచౌక్: రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం నూతన కమిటీ శనివారం స్థానిక గట్టయ్య సెంటర్‌లోని సంస్థ కమ్యూనిటీ హాల్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడు నల్లమోతు రవీంద్రనాథ్, కార్యదర్శి హరి శ్రీనివాస్, కోశాధికారి బొడ్డు సుధాకర్‌లను సంస్థ ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేయించారు. సంస్థ ప్రతినిధులు వడ్లమాని రవి, రాజ్యలక్ష్మీ, దొడ్డపనేని సాంబశివరావు, భూషణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ వితరణ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అవినేని శేషయ్య, పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య శనివారం డెస్కుటాప్, కంప్యూటర్‌ను వితరణగా అందించారు. స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, ఉపాధ్యాయులు అవినేని పుష్పావతి, సంధ్యారాణి, వసంత, రత్నశ్రీ, లావణ్య, సునీతారెడ్డి, రమాదేవి స్వరూపరాణి పాల్గొన్నారు.

బీఎస్పీ నిరసన

ఖమ్మం మామిళ్లగూడెం: తమిళనాడు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకు నిరసనగా పార్టీ జిల్లా కమిటీ శనివారం ఖమ్మం జెడ్పీ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేసింది. జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఉపేందర్, మిర్యాల నాగరాజు, విజయ్, వంశీ, జగదీష్, గోపి, సిద్దు, కార్తీక్, కమలరాజు పాల్గొన్నారు.

నేడు సీపీఎం కార్యాలయం ప్రారంభం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరంలోని 15వ డివిజన్ కొత్తగూడెంలో నిర్మాణం చేసిన సీపీఎం కార్యాలయాన్ని ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రారంభిస్తారని సీపీఎం నాయకుడు ఎస్‌కె మీరా తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'చట్టాలు రద్దు చేయాలి'

ఖమ్మం లీగల్: నూతన చట్టాలు రద్దు చేయాలని ఖమ్మం జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష శనివారం నాలుగోరోజుకు చేరింది. ఈ మేరకు ఓరుగంటి శేషగిరిరావు, తొండపు వెంకటేశ్వరరావు, స్పందనారెడ్డి, ధరావత్ రాందాస్ నాయక్, షేక్ మల్సూర్, కె.రవికుమార్, ధరావత్ వీరన్న దీక్షలో కూర్చోగా ఆర్ జేసి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు సంతోష్ కుమార్, రాజా సంఘీభావం తెలిపారు. బార్ కౌన్సిల్ సభ్యుడు సత్యనారాయణ, కృష్ణమూర్తి, మాధవరావు, శ్రీనివాసరావు, వెంకట్, తిరుమలరావు, పావెల్, శేఖర్ బాబు, వెంకియా, వెంకటేశ్వరరావు ఉన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జగ్జీవన్‌రావు వర్ధంతిని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, ఆర్‌జేసీ కృష్ణ జగ్జీవన్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నరేందర్, లింగనబోయిన సతీష్ పాల్గొన్నారు. బైపాస్ రోడ్ సర్కిల్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, గుండాల కృష్ణ, కార్పొరేటర్ కూరాకుల వలరాజు, మోతరపు శ్రావణి సుధాకర్, తొగర భాస్కర్, మాజీ కార్పొరేటర్ మచ్చ నరేందర్, మేకల సుగుణారావు, నగర ప్రచార కార్యదర్శి షేకిన, నిరోషా, నెమలి కిషోర్ పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్ల తొలగింపు


చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

ఖమ్మంఅర్బన్: నగరంలోని 6వ డివిజన్‌లోని ఎన్నెస్పీ ప్రధాన కాల్వకు ఇరువైపుల వాక్‌వేనందు ఉన్న కోనో కార్పస్ చెట్లను శనివారం కార్పొరేషన్ సిబ్బంది తొలగించారు. వాకర్ల కోరిక మేరకు అసిస్టెంట్ కమిషనర్‌తో డీఆర్ఎఫ్ సిబ్బందితో తొలగించినట్లు కార్పొరేటర్లు నాగండ్లకోటి, దండాజ్యోతిరెడ్డిలు తెలిపారు.